క్లుప్తంగా

పీడీలు ప్రముఖ పాత్ర వహించాలి



పీడీలతో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

పూతలపట్టు: మండలంలో 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి పోటీల్లో పీడీలు ప్రముఖ పాత్ర వహించాలని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. సోమవారం నియోజకవర్గంలోని పీడీలు, పీఈటీలతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 24 నుంచి నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. క్రీడాకారుల మధ్య ఎలాంటి తగాదాలు జరగకుండా విజయవంతం చేయాల్సిన బాధ్యత పీడీలపై ఎంతో ఉందని తెలిపారు. పీడీలకు కేటాయించిన మైదానాల్లో జరిగే క్రీడా పోటీకు బాధ్యతగా స్కోర్లు తెలియపరచాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ అధికారి నరసింహులు, మండల ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, 5 మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజేతలకు బహుమతి



క్రీడాకిట్‌ను అందజేస్తున్న నాయకులు

పూతలపట్టు: మండల స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి క్రీడాకారులు, జట్టుకు బహుమతులు అందజేశారు. మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో సోమవారం మండల స్థాయి విజేతలకు స్పోర్ట్స్ కిట్‌ను బహుమతిగా వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో కాకుండా నియోజకవర్గ స్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ గౌరి, స్థానిక సర్పంచ్ మాసిలామణి, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్, నాయకులు నిరంజన్‌రెడ్డి, రాణెమ్మ, మణి, ప్రవీణ్, ఆనందయ్య, బాలాజీ, పీడీలు కృష్ణా, డిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.

550 మందికి చీరల పంపిణీ

చిత్తూరు రూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట నేపథ్యంలో చిత్తూరు నగరంలోని కేవీఆర్ జ్యువలరీ అధినేత నారాయణ మూర్తి, శ్రీనివాసులు చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. 550 మంది మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటే్ తదితరలు పాల్గొన్నారు.

జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడికి సన్మానం



చంద్రను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పూతలపట్టు: జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మండలంలోని తేనేపల్లి పంచాయతీకి చెందిన బి.చంద్రను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు. చంద్ర మాట్లాడుతూ బీసీ వర్గాల ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మాసిలామణి, ఎంపీటీసీ రాణెమ్మ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఐరాల: పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ సుశీలమ్మ, ఎంఈఓలు రుషీంద్రబాబు, దామోదర్‌నాయుడు చేతుల మీదుగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, నిబద్ధతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు హేమచంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.మధు, మహిళా కార్యదర్శి రేఖ, హెచ్‌ఎంలు అరుణ్‌కుమార్, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

గుడిపాల: పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను మండల కేంద్రంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు రామ్‌నాయక్, గణపతి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల అభివృద్ధికి పీఆర్‌టీయూ విశేష కృషి చేస్తోందన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పరంధామనాయుడు, మండల అధ్యక్షులు సూరిబాబు, కార్యదర్శి వెంకటరమణారెడ్డి, యూనియన్ నాయకులు నాగరాజ్, ఆనంది, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు: శోభాయాత్రలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, **గుడిపాల:** బొమ్మసముద్రంలో పూజలు, రామభద్రాపురంలో అయోధ్య అక్షింతలు చేతపట్టి పూజలు చేస్తున్న మహిళలు, **ఐరాల:** కోదండరాముడికి ప్రత్యేకపూజలు, **యాదమరి:** ఆంజనేయ స్వామికి పూజలు







ఊరూరా మార్మోగిన రామనామం

- బాలరాముడి విగ్రహ ప్రతిష్టను వీక్షించిన భక్తజనం
- గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు

చిత్తూరు రూరల్: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఊరూరా రామనామం మార్మోగింది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠమహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని రామ మందిరాల్లో ప్రత్యేక ఉత్సవాలు, పూజలు చేశారు. చిత్తూరు నగరంలోని రామాలయాల్లో ఉదయం అభిషేకం చేశారు. మూలస్థానంలోని స్వామి వారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని తరించారు. ప్రతిష్ట నేపథ్యంలో ఆలయాలు, విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన టీవీల ద్వారా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని తిలకించి భక్తిపరవశంలో మునిగిపోయారు. అనంతరం అన్నదానం, బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని శ్రీ కన్యాకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్యుల సంఘ సభ్యులు శ్రీరామ నామ మంత్రాన్ని పఠిస్తూ అయోధ్య రాముని ఆరాధించారు. అనంతరం శ్రీరాముని చిత్ర పటంతో నగరంలో శోభాయాత్ర లనిర్వహించారు.



తవణంపల్లె: టి.పుత్తూరులో అభయ ఆంజనేయస్వామి విగ్రహానికి సంప్రోక్షణచేస్తున్న అర్చకులు

బంగారుపాళెం: మండలంలోని గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం రామాలయాలను భక్తులు ప్రత్యేకంగా అలంకరించారు. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారి మూల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలను చేపట్టారు. మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్, ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సీతారాముల గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద సీతారాముల చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. పట్టణంలోని మార్వాడీలు(సేట్లు) భక్తులకు అన్నదానం చేశారు. బాలరాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పాఠశాలల్లో విద్యార్థులు టీవీల ద్వారా వీక్షించారు.

శ్రీ రాముడికి విశేష పూజలు

ఐరాల: స్థానిక శ్రీ కోదండ రాములస్వామి వారి ఆలయంలో విశేషంగా అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివారికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. విచ్చేసిన భక్తులకు స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. పాతపాళ్యంలో ఓం శక్తి ఆలయంలో గ్రామస్తులు సీతారామలక్ష్మణుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు.

భజన మందిరాలలో ప్రత్యేక పూజలు

యాదమరి: మండంలోని శ్రీ రామ భజన మందిరాల్లో గ్రామీణ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామభజన మందిరంలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. చెన్నారెడ్డి పల్లెలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

అన్ని దేవాలయాల్లో పూజలు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం, చెరువు ముందరవూరు, రామభద్రాపురం గ్రామాల్లో పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గుడిపాల, వసంతాపురం, నంగమంగళం, పేయనపల్లె, బండపల్లె, చిత్తపార గ్రామాల్లో సోమవారం సాయంత్రం శ్రీరామచంద్రుని పటాన్ని ఊరేగించి, భజనలు పాడి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రామభక్తులు గోళ్ల హరిప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, లోకనాధరెడ్డి, అమరేంద్రబాబు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ప్రత్యేక పూజలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. రామ భజనలు, రామ కీర్తనలు ఆలపించారు. అనంతరం అర్ధగిరిలో భక్తుల కాలక్షేపం కోసం భాగవతార్‌చే హరికథ గానాలాపం చేశారు. మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయంలో విశేష పూజలు చేశారు. ఆలయ ఆవరణంలో నూతనంగా నిర్మించిన 34 అడుగుల అభయ ఆంజనేయస్వామికి భక్తి ప్రపత్తులతో సంప్రోక్షణ మహోత్సవం చేయించారు. అర్చకులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు అనంతరం నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయంలో మూలమంత్ర హోమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అభయ ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గర కలశ పూజలు నిర్వహించారు. కలశాల్లో ఉన్న తీర్థంలో నూతన అభయ ఆంజనేయస్వామి విగ్రహాన్ని సంప్రోక్షణ చేయించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎగువ వెంకటాపురంలోని రామాలయంలో సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు చేశారు.







యాదమరి: పెరుమాళ్లపల్లెలో సీతారాములకు పూజలు, **బంగారుపాళెం:** విశేషాలంకారంలో సీతారామస్వామి, **అర్ధగిరి:** హరికథ గానాలాపం, టి.పుత్తూరులో కలశాలతో పుష్కరిణి చుట్టూ ప్రదక్షిణలు చేసస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

స్పందన సమస్యలను సత్వరమే పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్: స్పందన కార్యక్రమంలో నమోదయ్యే అర్జీలను ఆయా శాఖల జిల్లా అధికారులు సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి జేసీ, డీఆర్‌ఓలు అర్జీలను స్వీకరించారు. అనంతరం జాయిం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఇందులో నమోదైన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో వివిధ శాఖలకు సంబంధించి 277 అర్జీలు అందాయని కలెక్టరేట్ ఏఓ కుల శేఖర్ వెల్లడించారు.

మామిడిలో యాంత్రీకరణపై అవగాహన

ఐరాల: మామిడి పంటలో యాంత్రీకరణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని 35 యర్లంపల్లె సచివాలయంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకంపై స్థానిక సర్పంచ్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు రమణ మాట్లాడుతూ మామిడి పంటకు మందుల పిచికారీ, కోత కోయడంలో యాంత్రీకీకరణ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విడుదలైన వరి, వేరుశనగ, చెరకు, రాగి మేలైన వంగడాల గురించి వివరించారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాల పొట్టు తీసే యంత్రాలు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడిలో ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ప్రస్తుతం మామిడి తోటల్లో మొదటి పిచికారీ కోసం మోనోక్రోటోఫాస్–2 ఎంఎల్, బిప్రోఫైసిన్–1.5 ఎంఎల్, కార్బెండిజం– 1.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. మామిడి రైతులు ప్రతి పిచికారీలోనూ వేప, కానుగ సంబంధిత నూనెలు కలుపుకొని వాడటం వల్ల ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ రెడ్డి రాము మాట్లాడుతూ వివిధ పంటల్ల కలుపుకు వేసుకోవలసిన మందులు, ఎరువులు, జనవరి మాసంలో సాగు చేయాల్సిన పంటల గురించి రైతులకు వివరించారు. అనంతరం కళాశాల విద్యార్థులు వ్యవసాయ ప్రదర్శనలో భాగంగా సోలార్ ఇరిగేషన్, వర్మీకంపోస్ట్, పుట్టగొడుగుల పెంపకం, మల్చింగ్, సమగ్ర వ్యవసాయ పద్ధతుల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త నాగమణి, ప్రిన్సిపల్ రెప్ర జెంటేటివ్ వెంకటరెడ్డి, వీఏఏ జ్యోత్స్న పాల్గొన్నారు.



విద్యార్థుల చేసిన నమూనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు

బాధ్యతగా వ్యవహరించాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల ప్రక్రియకు నియమితులైన నోడల్ అధికారులు తమ విధులపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎన్నికల కసరత్తుపై అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నోడల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25న ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఆరోగ్యశ్రీలో నిర్లక్ష్యమొద్దు

పూతలపట్టు: ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో నిర్లక్ష్యమొద్దని రాష్ట్ర ఆరోగ్యశ్రీ నోడల్ అధికారి సునీల్‌కుమార్ నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్డుల పంపిణీపై ఆరా తీశారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన బీటెక్ విద్యార్థి సోమవారం అనుమానాస్పద స్థితిలో చెందాడు. వన్‌టౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు.. నగరం సాంబయ్యకండ్రిగ కు చెందిన చంద్రశేఖర్ (22) ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. సోమేవారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని. అనుమానాస్పద కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

చిత్తూరు అర్బన్: వెదురుకుప్పం మండలానికి చెందిన రమ్య (28) చిత్తూరు నగరం ఎస్టేట్‌లోని తమ బంధువుల ఇంట్లో ఉంటోంది. ఓ పని నిమిత్తం ఈనెల 20వ తేదీ ఇంటి నుంచి బయటకు వచ్చింది. అప్పటి నుంచి మహిళ ఆచూకీ లేకపోవడంతో బంధువులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉలసయ్య పేర్కొన్నారు.

జగనన్న చేసిన మేలును చెబుదాం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి
- బీఎన్ఆర్‌పేట, అనంతాపురం పంచాయతీల్లో పల్లెబాట

చిత్తూరు రూరల్:
విజయానందరెడ్డి: అమ్మ బాగుండారా..
అవ్వ: బాగుండమయ్యా..
విజయానందరెడ్డి: పింఛన్ వస్తా ఉండదా...
అవ్వ: నెల పుడితే ఇంటికాడికే తెచ్చి ఇస్తా ఉండారు నాయనా...
విజయానందరెడ్డి: పింఛన్ ఎవరిస్తా ఉండారు...
అవ్వ: (నవ్వుతూ...)జగన్. ఆ దబ్బులే మాలాంటోళ్లకు ఉపయోగపడతా ఉండాది. మేము యానాడూ జగన్ మేలు మర్చిపోం. ఆ అబ్బోడికే ఓటేస్తాం...

ఇలా ప్రతి కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆప్యాయంగా పలకరించారు. వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చిత్తూరు మండలం బీఎన్ఆర్‌పేట, అనంతాపురం పంచాయతీల్లో సోమవారం విజయానందరెడ్డి ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం చేపట్టారు. వారు ముందుగా బీఎన్ఆర్‌పేటలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ జగనన్న మేలును చెబుదాం..జనాల్లోకి వెళదామని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసేవలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిమగ్నమయ్యారని చెప్పారు. పేదల అభివృద్ధే ధ్యేయంగా ఇంటికే సంక్షేమ ఫలాలను అందించారన్నారు. ఇందులో ఎలాంటి అవినీతి, అక్రమాలు లేవన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. పారదర్శక పాలన తీసుకొచ్చారని కొనియాడారు. నాడు–నేడుతో ఆస్పత్రులు, ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చారని, విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని చెప్పారు. వైద్యుల వద్దకు ప్రజలు వెళ్లే రోజులు పోయి, ఇప్పుడు ప్రజల వద్దకే వైద్యులొచ్చే రోజులు వచ్చాయన్నారు. ప్రజలంతా జగనన్న చేస్తున్న మేలును గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామన్నారు. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధికి తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, సర్పంచులు అమరనాథ్‌రెడ్డి, త్యాగరాజులు, భాస్కర్, భాస్కర్‌రెడ్డి, మునిరత్నం, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, సుదర్శన్, నాయకులు సంపత్, జయపాల్, వేలుస్వామి, భాస్కర్‌నాయుడు, రాజా, భాస్కర్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.



బీఎన్ఆర్‌పేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సమన్వయకర్త విజయానందరెడ్డి

నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు నియోజకవర్గం ఓటర్ల తుది జాబితాను ఆర్డీఓ, ఈఆర్ఓ చిన్నయ్య విడుదల చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం చిన్నయ్య మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఓటర్ల తుది జాబితాను పకడ్బందీగా రూపొందించినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్లు 2,01,741, పురుషులు 97,765, మహిళలు 1,03,023, ఇతరులు 34, సర్వీస్ ఓట్లు 868, ఎన్ఆర్ఐ ఓట్లు 51 ఉన్నట్లు వెల్లడించారు. ఈ జాబితాను నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా ఫిర్యాదులుంటే లిఖిత పూర్వకంగా కార్యాలయంలో అందజేయాలని ఆర్డీఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓ, నగరపాలక కమిషనర్ అరుణ, చిత్తూరు తహసీల్దార్ మురళిమోహన్ పాల్గొన్నారు.

పూతలపట్టు: నియోజకవర్గంలోని ఓటర్లు తుది జాబితాను సరిచూసుకోవాలని ఈఆర్వో శివయ్య తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ఓటర్ల తుదిజాబితాను విడుదల చేశారు. నియోజకవర్గంలోని 260 పోలింగ్ కేంద్రాలకుగాను 260 బీఎల్వోలకు ఓటరు తుదిజాబితా అందజేసినట్లు తెలిపారు. పోలింగ్ పరిధిలోని ఓటర్లు వారి బీఎల్వోల వద్ద సరిచూసుకోవాలని తెలిపారు. విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పురుషులు ఓటర్లు 1,08,381, స్త్రీలు ఓటర్లు 1,11,577, ఇతరులు 8, మొత్తం 2,19,966 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లుగా బంగారుపాళెం మండలం, అత్యల్ప ఓటర్ల గల మండలం పూతలపట్టు అని తెలిపారు. నూతనంగా నమోదు చేసుకున్న ఓటర్ల వివరాలను మరోసారి బీఎల్వోలు పరిశీలించాలని సూచించారు. వివరాల్లో ఫొటోలు, పేర్లు వంటివి తప్పులు ఉన్నట్‌లైతే వెంటనే తహసీల్దార్‌కి, డీటీకి, ఈఆర్వోకి తెలియజేయాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో ఓటర్లలో స్త్రీలే అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్(ఎన్నికల) మహేశ్వరి, డీటీ మునికృష్ణ, బీఎల్వోలు, అధికారులు పాల్గొన్నారు.




ఓటర్ల జాబితాలు విడుదల చేస్తున్న చిత్తూరులో ఆర్డీఓ చిన్నయ్య, కమిషనర్ అరుణ, పూతలపట్టులో ఈఆర్వో శివయ్య